క్లుప్తంగా

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



సుద్దమల్లలో లక్ష్మీ నరసింహ కంబగిరి స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

ఉయ్యాలవాడ : మండలంలోని సుద్దమల్ల, ఇంజేడు, ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ గ్రామాల్లో వెలిసిన ఆలయాల్లో శ్రీ లక్ష్మీనరసింహ కంబగిరిస్వామి, శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి, అభయాంజనేయస్వామికి శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయాన్నే ఆయా గ్రామాల్లోని ఆలయాలకు చేరుకుని భక్తులు అభిషేకాలు, కుంకుమార్చన, ఆకుపూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు కమలేష్‌శర్మ, అనంతయ్య, లక్ష్మణస్వామి, భాస్కర శర్మ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నేటి నుంచి ఆలయ వార్షికోత్సవం



పాండురంగస్వామి

నంద్యాల(అర్బన్): మండలంలోని పాండురంగాపురం గ్రామంలో వెలసిన శ్రీరుక్మిణీ సమేత పాండురంగ, వేణుగోపాల, గణపతి కామేశ్వరి, నంది సమేత కామేశ్వర, అభయాంజనేయ, సుబ్రహ్మణ్యేశ్వర, వీరభద్ర నవగ్రహ ఆలయ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం నుంచి మార్చి 2వ తేదీ వరకు జరుగుతాయని నిర్వాహకులు శనివారం తెలిపారు. 26 ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్య మేళనం తదితరాలతో ప్రారంభమై సాయంత్రం ప్రదోష పూజలు, మంగళ హారతులు ఉంటాయన్నారు. 27న ప్రాతఃకాల పూజలు, అభిషేకాలు, సహస్ర నామార్చనలు ఉంటాయన్నారు. 28న మంత్ర పుష్పం, తీర్థప్రసాద వితరణ, మార్చి 1న అభయాంజనేయస్వామి, నవగ్రహ అభిషేకాలు, ఆకుపూజ, అర్చనలతో పాటు పాండురంగస్వామికి 108 కలశాలతో సుగంధ ద్రవ్య అభిషేకాలు, తిరుమంజనం చేస్తామన్నారు. 2న మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, కలశ పూజలు, జయాది హోమాలు, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం, సాయంత్రం గరుడ సేవ, గ్రామోత్సవం జరిపిస్తామని వివరించారు.

మద్దిలేటిస్వామికి పల్లకోత్సవం



పల్లకోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): స్థానిక తెలుగుపేటలో వెలసిన శ్రీమద్దిలేటి లక్ష్మీనరసింహస్వామికి శనివారం సాయంత్రం పల్లకోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించి స్వామి వారిని పట్టువస్త్రాలతో అలంకరించి మహామంగళ హారతులు ఇచ్చారు. సాయంత్రం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను పల్లకీలో ఆశీనులు గావించి ప్రత్యేకపూజల అనంతరం ఆలయ ప్రాకారంలో ఊరేగించారు.

ఇమ్యునైజేషన్ ప్రక్రియ తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్

శిరివెళ్ల: మండలంలో జరుగుతున్న ఇమ్యునైజేషన్ ప్రక్రియను జిల్లా అడ్మినిస్ట్రేటివ్ అధికారి డాక్టర్ చంద్రశేఖర్ శనివారం తనిఖీ చేశారు. స్థానిక పీహెచ్‌సీ పరిధిలో జరుగుతున్న కార్యక్రమ వివరాలను డాక్టర్ దివ్యను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి బుధవారం, శనివారం విధిగా కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. అలాగే కార్యక్రమం వల్ల కలిగే లాభాలను ప్రజలకు వివరించాలని చెప్పారు. పుట్టిన ప్రతి బిడ్డకు టీకాలు వేయాలన్నారు. సీహెచ్ఓ రామ్మోహనరెడ్డి, సూపర్‌వైజర్లు, రవికిషోర్, అమీనాబీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఈఓగా రామసుబ్బయ్య



ఎంఈఓను అభినందిస్తున్న హెచ్‌ఎంలు

రుద్రవరం: ఎంఈఓగా రామసుబ్బయ్య శనివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న వెంకటరామిరెడ్డి సెలవుపై వెళ్లారు. దీంతో విద్యాశాఖ ఉన్నతాధికారులు మహానంది మండలంలో ఎంఈఓగా విధులు నిర్వహిస్తున్న రామసుబ్బయ్యకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ఆయన విధుల్లో చేరారు. ఈ సందర్భంగా స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరెడ్డి, ఏపీ మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ నంగెపు నాగేశ్వరరావులతో పాటు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల హెచ్‌ఎంలు,ఉపాధ్యాయులు కొత్త ఎంఈఓను కలిసి అభినందనలు తెలిపారు.

దినదిన ప్రవర్ధమానం..పుట్టాలమ్మ క్షేత్రం

- కొండపై నారసింహుడు.. కొండ కింద శివుడు.. ఎదురుగా పుట్టాలమ్మ
- రామతీర్థంలో ప్రసిద్ధి చెందిన మూడు దేవస్థానాలు
- క్షేత్ర అభివృద్ధికి పాలకమండలి చర్యలు

హరి హరులతో పాటు పుట్టాలమ్మ కొలువుదీరి ఉండటం రామతీర్థం క్షేత్రం విశిష్టత. కొండ పైభాగంలో యోగానంద లక్ష్మీ నరసింహస్వామి, అమృతవల్లి, కొండ దిగువున శ్రీ పరుశరామలింగేశ్వర స్వామి, భ్రమరాంబదేవి, వారికి ఎదురుగా పుట్టాలమ్మ వెలిశారు. భక్తుల కోరికలు నెరవేరుస్తూ వారి కొంగుబంగారంగా విలసిల్లుతున్నారు. ప్రస్తుతం క్షేత్ర అభివృద్ధికి పాలకమండలి పూనుకుంది. ఇప్పటికే దాతల సాయంతో వసతి గృహ సముదాయం పూర్తి చేయగా, రాజగోపుర నిర్మాణానికి నిధులిచ్చేందుకు టీటీడీ సుముఖత వ్యక్తం చేసింది. అభివృద్ధి పనులతో క్షేత్రం దినదిన ప్రవర్ధమానంగా విరాజిల్లుతోంది.

ఆళ్లగడ్డ: మండల పరిధిలో శ్రీ రామతీర్థం పుట్టాలమ్మ క్షేత్రం ఎంతో విశిష్టతగాంచింది. ఒకప్పుడు ఇదంతా అటవీ ప్రాంతంగా ఉండటంతో జన సంచారం ఉండేది కాదు. అలాంటి రోజుల్లో ఓ భక్తుడికి శివ కేశవులు కలలో దర్శనమిచ్చి తాము కొలువైన కొండ ఆనవాళ్లను చెప్పారు. ఆలయాలను శుద్ధి చేసి పూజాదికాలు జరిపించమని ఆదేశించి అదృశ్యమయ్యారు. దీంతో సదరు భక్తుడు అడవిలో శోధించగా దేవేరులతో కొలువైన యోగానంద లక్ష్మీనరసింహస్వామి, పరుశరామలింగేశ్వర స్వాములతో పాటు పుట్టాలమ్మ కొలువు వెలుగులోకి వచ్చింది.

ఒకే క్షేత్రం..మూడు ప్రసిద్ధ ఆలయాలు..

ఇక్కడ కొండపై శ్రీ యోగానంద లక్ష్మీనరసింహస్వామి, అమృతవల్లి అమ్మవార్లు కొలువై ఉండగా, కొండ దిగువున శ్రీ పరుశరామలింగేశ్వర స్వామి, భ్రమరాంబదేవి పూజలందుకుంటున్నారు.వీరికి ఎదురుగా పుట్టాలమ్మ (పుట్ట) కొలువై ఉంది. వీరి మధ్యన కొండ మధ్య భాగంలో కోనేరులు, జలాశయాలు ఉండటం, కొండపై ఒక చిన్న బావిలో నిరంతరం నీరు తగ్గకపోవడం విశేషం. ఈ బావి నీటితోనే స్వామి వార్లకు అభిషేకం చేస్తారు. అందుకే భక్తులు ఈ నీటిని తీర్థంగా స్వీకరిస్తారు.

అభివృద్ధి మంత్రం..

దశాబ్దాలుగా పాలకుల నిర్లక్ష్యంతో అభివృద్ధికి దూరంగా నిలిచింది క్షేత్రం. ఆదాయం పెరగక అభివృద్ధి కానరాక దీన స్థితిలో ఉండేది. ప్రస్తుత పాలక మండలి ఏర్పాటుతో క్షేత్ర విశిష్టతను ప్రజల్లోకి తీసుకెళ్తుండటంతో భక్తుల సందర్శన భారీగా పెరిగింది. దీంతో ఆలయాలకు ఆదాయం సమకూరుతోంది. హుండీల ద్వారా కానుకలు, అభివృద్ధి పనులకు దాతల విరివిగా సహకరిస్తున్నారు. దీంతో క్షేత్రంలో అభివృద్ధి పనులు వడివడిగా సాగుతున్నాయి.



పుట్టాలమ్మ ఆలయం



గంగుల తిమ్మారెడ్డి ఉచిత కల్యాణ మండపం



రూ 80 లక్షలతో నిర్మించిన వసతి గృహం

భక్తులకు మెరుగైన వసతులు



ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి సహకారంతో క్షేత్ర చైర్మన్ గంగుల మనోహర్‌రెడ్డి, పాలకమండలి సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. అలాగే ప్రతి అదివారం భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేస్తున్నాం. రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తాం. - సాయి జయచంద్రారెడ్డి, ఈఓ

క్షేత్ర అభివృద్ధే లక్ష్యం



ఎంతో పురాతనమైన, స్వయంభువులైన మూడు దేవస్థానాలు ఒకే చోట ఉన్న క్షేత్రానికి చైర్మన్‌గా ఉండటం నా అదృష్టం. క్షేత్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నాం. పాలకమండలి సభ్యులతో పాటు అభివృద్ధి కమిటీ సభ్యులతో కలిసి క్షేత్ర అభివృద్ధికి కృషి చేస్తున్నాం. - గంగుల మనోహర్‌రెడ్డి, పుట్టాలమ్మ క్షేత్రం చైర్మన్

పూర్తయిన పనుల్లో కొన్ని..

- తాగునీటి సమస్య తీర్చేందుకు నూతన రక్షిత మంచినీటి పథకాన్ని నిర్మించారు.
- పుట్టాలమ్మ వారి గుడిని విస్తరింపజేసి బారికేడ్లను ఏర్పాటు చేశారు.
- నూతనంగా మరుగుదొడ్లను నిర్మించి వినియోగంలోకి తీసుకొచ్చారు.
- స్నానఘట్టాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేయించారు.
- మురుగునీరు బయటకు వెళ్లేలా డ్రైనేజీ కాలువలు నిర్మించారు.
- తొమ్మిది గదులతో కాటేజీ నిర్మాణ పనులు సాగుతున్నాయి.
- క్షేత్రం చుట్టపక్కల పెరిగిన ముళ్ల పొదలు, రాళ్లు తొలగించి బయలు ప్రదేశాలు ఏర్పాటు చేశారు.
- అన్నదాన కార్యక్రమ నిర్వహణకు షెడ్డును నిర్మించారు.
- ప్రస్తుతం ఆలయానికి హుండీల ద్వారా ఏటా రూ.18లక్షల నుంచి రూ.20లక్షలు, వేలం పాటల ద్వారా రూ.15లక్షల నుంచి రూ.18 లక్షల వరకు ఆదాయం సమకూరుతోంది.

జరుగుతున్న పనులు..

- రూ. 20 లక్షలతో భక్తులకు స్నానపు గదులు,దుస్తులు మార్చుకునేందుకు, డ్రైనేజీ కాలువ నిర్మాణం
- రూ.15 లక్షలతో గంగుల తిమ్మారెడ్డి ఉచిత కల్యాణ మండపం పెయింటింగ్,మరమ్మతులు
- రూ.16 లక్షలతో భక్తులకు తాగునీటిని తీర్చేందుకు ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణం
- రూ.85 లక్షలతో భక్తుల సౌకర్యార్థం పుట్టాలమ్మ వసతిగృహ సముదాయ నిర్మాణం
- రూ. 80 లక్షలతో నరసింహస్వామి రాజగోపురం నిర్మాణానికి టీటీడీ అంగీకారం
- రూ.24 లక్షల ఎంపీల నిధులతో ఆలయ ప్రాంగణంలో పైప్‌లైన్, కుళాయిలు

రథసారథులుగా వ్యవహరించండి

- ప్రతి కుటుంబాన్నీ పలకరించండి
- వచ్చే ఎన్నికల్లో జగనన్నను గెలిపించేందుకు కృషి చేద్దాం
- సచివాలయ కన్వీనర్‌లు, గృహ సారథులకు దిశా నిర్దేశం ఎమ్మెల్యే గంగుల



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: రాబోయే ఎన్నికల్లో జగనన్న ప్రభుత్వానికి రథ సారథులుగా గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు ముందుండి నడిపించాలని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక మహాలక్ష్మి ఫంక్షన్ హాలులో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణ, రూరల్ మండలం పరిధిలోని గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో పని చేసి వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేసి జగనన్నను మళ్లీ సీఎంగా గెలిపించుకుందామన్నారు. ఇప్పటి వరకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రూ.1.19 లక్షల కోట్లు సంక్షేమ పథకాల పేరుతో పేదలకు అందజేశారన్నారు. గతంలో ఎన్నడూ, ఏ సీఎం చేయని విధంగా ఇచ్చిన హామీల్లో 98 శాతం పైగా అమలు చేసిన ఘనత మన నాయకుడికే దక్కుతుందన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడి, పథకాలు, అభివృద్ధి గురించి వివరించాలని సూచించారు. అలాగే గతంలో టీడీపీ పాలనను జగనన్న పాలనను పోల్చి చెప్పాలని, నాడు పథకాలు పొందడానికి పడిన కష్టాలను కళ్లకు కట్టినట్లుగా వివరించి వారికి అవగాహన కల్పించాలని కోరారు. దుష్ట చతుష్టయం చేస్తున్న ఆరోపణలు, దుష్ప్రచారాలను ప్రజలకు తెలియజేయాలని చెప్పారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు నరసింహారెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వరలక్ష్మి, నాయకులు నాయబ్ రసూల్, నాసారి ప్రసాద్, దాదాపీర్, సుధాకర్‌రెడ్డి, నజీర్ పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు



నాడు శిథిలావస్థకు చేరి..



నేడు కార్పొరేట్ స్థాయిలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కార్యాలయం

నాడు శిథిలం.. నేడు వైభవం

నంద్యాల(రూరల్): పట్టణంలోని నూనెపల్లె సమీపంలోనున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కార్యాలయం కొన్ని సంవత్సరాలుగా శిథిలావస్థలో ఉండేది. గతంలో అనేక మంది అధికారులు, నాయకులు మారినా కార్యాలయం బాగోగులను పట్టించుకోలేదు. అయితే 2020 మార్చి నెలలో ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన ఓ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి సమావేశం అనంతరం ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కార్యాలయాన్ని పరిశీలించి నూతన భవనాన్ని ఏర్పాటు చేయిస్తామని అధికారులకు హామీనిచ్చారు. ఎమ్మెల్యే, ఈఈ మనోహర్ ఆదేశాలతో డీఈ నూతన కార్యాలయానికి పనులు ప్రారంభించి కార్యాలయాన్ని నూతన హంగులతో నిర్మించారు. నూతన భవనం కార్పొరేట్ స్థాయికి దీటుగా ఉండటంతో కార్యాలయానికి వచ్చే ప్రజలు, అధికారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఒకే గదిలో డీఈ, ఏఈ, సిబ్బంది, ల్యాబ్‌లు ఉండేవి. చిన్నపాటి వర్షానికే కార్యాలయం మొత్తం వెలుస్తుండటంతో ఫైళ్లు తడిచిపోయేవి.

ఉచిత వైద్య శిబిరం



ఉచిత వైద్యశిబిరంలో పాల్గొన్న చిన్నారులు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక మధుమణి నర్సింగ్ హోం సమావేశ మందిరంలో ప్రపంచ కాక్లియర్ ఇంప్లాంట్ దినోత్సవం సందర్భంగా ఉచిత మెగా వినికిడి పరీక్ష చికిత్స శిబిరాన్ని డాక్టర్ మధుసూదన రావు శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రస్తుతం రూ.13లక్షల విలువైన కాక్లియర్ ఇంప్లాంట్ ఆపరేషన్ రెండు చెవులకు వర్తించేలా ఆరోగ్యశ్రీలో చేర్చి ఎంతో మంది చెవిటి పిల్లలకు మేలు చేశారని కొనియాడారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన నాగార్జున యూనివర్సిటీ మాజీ వీసీ వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ కాక్లియర్ ఇంప్లాంట్ ఆపరేషన్లు చేయడం గొప్ప విషయమన్నారు. 250 మంది చిన్నారులకు ఖరీదైన వినికిడి పరీక్షలు చేయడం అభినందనీయమని ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ అన్నారు.డాక్టర్ మణిదీప్, డాక్టర్ రామకృష్ణారెడ్డి, డాక్టర్ నాగమణి, రోహిత్, వెంకటమస్తాన్ పాల్గొన్నారు.

సచివాలయాల్లో మెరుగైన సేవలందించాలి



మాట్లాడుతున్న కమిషనర్ రవిచంద్రారెడ్డి

నంద్యాల(సిటీ): పట్టణంలోని 43 వార్డు సచివాలయాల్లో ప్రజలకు మెరుగైన సేవలందేలా మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్లు దృష్టి సారించాలని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి తెలిపారు. శనివారం స్థానిక కార్యాలయంలో డీఎల్‌డీఓ జనార్దన్‌రావు ఆధ్వర్యంలో సచివాలయ పర్యవేక్షణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ సచివాలయాల్లో ప్రజలకు అందుతున్న సేవల్లో ఎటువంటి జాప్యం చేయరాదన్నారు. సచివాలయాల పర్యవేక్షణ కోసం 11 మంది మున్సిపల్ అధికారులకు అదనపు బాధ్యతలు అప్పగించామన్నారు. వీరు ఒక్కొక్కరు 8 సచివాలయాలను పర్యవేక్షిస్తారని చెప్పారు. ప్రజల నుంచి వచ్చే వినతులు ప్రతిరోజూ 3 నుంచి 5 గంటలకు అందుబాటులో ఉండి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే స్థిరాభివృద్ధి లక్ష్యాలను, ఆయుష్మాన్‌భారత్, ఏపీ సేవ సర్వీసులు, తదితర వాటిని క్షుణ్ణంగా పరిశీలించాలని కోరారు. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు, సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు



దోమల మందు పిచికారీ చేయిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

నంద్యాల(సిటీ): పట్టణంలోని దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్‌మాబున్నిసా తెలిపారు. శనివారం స్థానిక మున్సిపల్ టౌన్‌హాల్‌లో ప్రజారోగ్య విభాగంతో పట్టణంలోనున్న సమస్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పట్టణంలో దోమల బెడద తీవ్రంగా ఉన్నందున, వాటిని అరికట్టేందుకు 8 ఫాగింగ్ మిషన్లు, 15 స్ప్రేయర్లు అందుబాటులోకి తెచ్చామన్నారు. ప్రణాళిక బద్ధంగా ప్రతి వార్డులో ఫాగింగ్, స్ప్రేయింగ్ చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే పారిశుద్ధ్య సిబ్బంది పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి, శానిటేషన్ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివప్రసాదరెడ్డి పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్ష

నంద్యాల(అర్బన్): విజయ డెయిరీలో తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే దీక్షలు శనివారం ఐదో రోజు కొనసాగాయి. జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ ఆరు మాసాలుగా శాంతియుత ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా జిల్లా అధికారులు విచారణ చేపట్టకపోవడం అన్యాయమన్నారు. ఎందుకు విధుల నుంచి తొలగించారో యాజమాన్యానికి కోరినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. గౌస్, లక్ష్మణ్, బాలవెంకట్, నాగరాజు, ప్రసాద్, శేఖర్, కరుణాకర్ పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

ఆళ్లగడ్డ: మండల కేంద్రం చాగలమర్రి సమీపంలో శనివారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు గాయపడ్డారు. దువ్వూరు మండలం కుమ్మరిపల్లెకు చెందిన జయరామిరెడ్డి, శ్రీనివాసులు చాగలమర్రికి మోటార్ సైకిల్‌పై వస్తూ జాతీయరహదారిపై కూలూరు రస్తా సమీపంలో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొంది. గాయపడిన వారిని స్థానిక కేరళ వైద్యశాలకు తరలించారు. జయరామిరెడ్డి పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు నంద్యాల వైద్యశాలకు రెఫర్ చేశారు. అలాగే చాగలమర్రికి చెందిన హుసేన్‌బాషా, మహబూబ్‌బాషా మోటార్ సైకిల్‌పై ప్రొద్దుటూరు వెళ్తూ జాతీయ రహదారి సమీపంలో కర్నూలు నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. దీంతో వారిద్దరూ గాయపడ్డారు. రెండు ఘటనలపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రమణయ్య తెలిపారు.

క్రైం కార్నర్

పాముకాటుతో బాలిక మృతి

బొమ్మలసత్రం: నంద్యాల మండలం చాబోలు గ్రామానికి చెందిన శ్రావణి (8) శనివారం పాముకాటుకు ప్రాణాలు విడిచింది. గ్రామానికి చెందిన రైతు శ్రీనివాసులు భార్యతో కలిసి పొలం పనికి వెళ్లాడు. శ్రావణి ఇంటి ముందు ఆడుకుంటూ సమీపంలో ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్ వద్దకు నీళ్లు తాగేందుకు వెళ్లింది. ఈ క్రమంలో చూసుకోకుండా పామును తొక్కింది. దీంతో అది వెంటనే కాటు వేయడంతో శ్రావణి కేకలు వేయడంతో స్థానికులు చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ కోలుకోలేక బాలిక మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

2న వేలం పాటలు

గడివేముల: స్థానిక మూలపెద్దమ్మ జాతర సందర్భంగా తలనీలాల ప్రోగు చేసుకునేందుకు మార్చి 2వ తేదీన బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ మోహన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పాల్గొనే వారు రూ.10 వేలు డిపాజిట్ చేయాలన్నారు. వచ్చే నెల 23 నుంచి ఏప్రిల్ 24వ తేదీ వరకు మాత్రమే తలనీలాలు ప్రోగు చేసుకోవచ్చన్నారు.

సంక్షిప్తం

రేపు రేనాటి సూర్యచంద్రుల సంస్మరణ సభ

నంద్యాల(వ్యవసాయం): రేనాటి సూర్యచంద్రుల సంస్మరణ సభను సోమవారం వివేకానంద ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు రేనాటి సూర్యచంద్రుల స్మారక సమితి కార్యదర్శి కర్నాటి రామకృష్ణారెడ్డి, అంతర్జాతీయ మాజీ శాస్త్రవేత్త రవీంద్రనాథ్ శనివారం తెలిపారు. వారు మాట్లాడుతూ ఉయ్యాలవాడ నరసింహారెడ్డి కలియుగ దానకర్ణుడు బుడ్డా వెంగళరెడ్డి సంస్మరణార్థం 27న సాయంత్రం 4గంటలకు సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, రచయితలు, కవులు, మేధావులు పాల్గొంటారని పేర్కొన్నారు. అలాగే కార్యక్రమంలో కర్నూలు లలిత కళా సమితి అధ్యక్షుడు శ్రీపత్తి ఓబులయ్య రచించిన రేనాటి చంద్రుడు పుస్తకాన్ని ఆవిష్కరిస్తామన్నారు.

పాడి రైతులకు రూ.25.77లక్షల బోనస్

రుద్రవరం: స్థానిక విజయ మినీ డెయిరీకి పాలు పోస్తున్న రైతులకు బోనస్ కింద నంద్యాల విజయ పాల డెయిరీ నుంచి రూ.25,77,160 మంజూరయ్యాయని మేనేజర్ శివశంకర్‌రెడ్డి తెలిపారు. స్థానిక డెయిరీలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది రైతులు విజయ డెయిరీకి 13.06 లక్షల లీటర్ల పాలు పోశారన్నారు. ఇందుకు సంబంధించి ఒక్కో లీటర్‌కు రూ.2 చొప్పున బోనస్ మంజూరైందని చెప్పారు.ఆ మొత్తాన్ని స్థానిక మినీ డెయిరీ పరిధిలోని 42 కేంద్రాల్లో పాలు పోస్తున్న పాడి రైతులకు పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే పలు కేంద్రాల్లో రైతులకు బోనస్ సొమ్ము పంపిణీ చేశారన్నారు. మిగిలిన కేంద్రాల్లో పంపిణీ కొనసాగుతోందని చెప్పారు.

మత్తు పదార్థాలపై అవగాహన

గోస్పాడు:విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వాటి గురించి అవగాహన అవసరమని ఏఎస్ఐ మద్దిలేటి అన్నారు. మండల కేంద్రం, దీబగుంట్ల జూనియర్ కాలేజీల్లో శనివారం విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పరిచయం లేని కొత్త వ్యక్తులతో దూరంగా ఉండాలన్నారు. అలాంటి వారు ఏమైనా స్వీట్లు, చాక్లెట్లు వంటి ఇతర తిను పదార్థాలు ఇస్తే తీసుకోకూడదన్నారు. అలాగే విద్యార్థులు సెల్‌ఫోన్లకు బానిసలు కావొద్దని పరిమితంగా వాడాలని సూచించారు. ముఖ్యంగా సోషల్ మీడియాలో వచ్చే ప్రకటనల బారిన పడి మోసపోవద్దన్నారు. లోన్‌యాప్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

27 నుంచి మొబైల్ ఆధార్ సేవలు

నంద్యాల(సిటీ): పట్టణంలోని ప్రజా ప్రయోజనాల నిమిత్తం మొబైల్ ఆధార్ సేవలు అందుబాటులో ఉంచుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి శనివారం తెలిపారు. ఫరూక్‌నగర్, వైఎస్సార్‌నగర్, ఏకలవ్యనగర్, వీసీ కాలనీ ప్రాంతాల్లో 27, 28వ తేదీల్లో ఆధార్ మొబైల్ సేవలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. పట్టణంలోని ఇంకా ఆధార్ అప్‌డేట్ చేయని 41,129మంది ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆర్బీకేల్లో జొన్నల కొనుగోలు

ఆళ్లగడ్డ: రైతు భరోసా కేంద్రాల ఆధ్వర్యంలో ప్రభుత్వం జొన్నలు కొనుగోలు చేస్తుందని చాగలమర్రి మండల వ్యవసాయాధికారి రంగనేతాజీ తెలిపారు. శనివారం చాగలమర్రి రైతు భరోసా కేంద్రంలో జొన్న పంట సాగు చేసిన రైతులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జొన్నలకు మద్దతు ధర క్వింటాకు రూ.2,970 ప్రకారం నిర్ణయించిందని, సంచులు, హమాలీ, ట్రాన్స్‌పోర్ట్ ఖర్చు కూడా ప్రభుతమే భరిస్తుందని చెప్పారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలి

నంద్యాల(అర్బన్): బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని పట్టణ నడిబొడ్డున ఏర్పాటు చేయాలని సమత సైనిక్‌దల్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు ప్రేమ్ కుమార్ కోరారు. బొమ్మలసత్రం వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహ సమీపంలో సీసీ కెమెరాలు, ఫ్లడ్‌లైట్ల వెలుతురుతో రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద సైనిక్‌దల్ నాయకులతో కలిసి శనివారం ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహం విధ్వంసం గురి కావడం బాధాకరమన్నారు. ఇందుకు నిరసనగా ఈ నెల 27 నుంచి 28వ తేదీ వరకు శాంతియుత రిలే దీక్ష చేపడతామని తెలిపారు. ధ్వంసమైన విగ్రహ స్థానంలో కొత్త విగ్రహం ఏర్పాటు చేయాలని కోరారు.

రైతులు ఈ-కేవైసీ చేయించుకోవాలి

గోస్పాడు: పీఎం కిసాన్ కోసం ఈ-కేవైసీ చేయించుకోని రైతులు స్థానిక ఆర్‌బీకే కేంద్రాల్లో చేయించుకోవాలని వ్యవసాయాధికారి అబ్దుల్‌హక్ తెలిపారు. మండలంలోని జిల్లెల్ల, ఎం.కృష్ణాపురం గ్రామాల్లోని ఆర్‌బీకేలను శనివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జిల్లెల్లో 439 మంది రైతులు ఈ-కేవైసీ చేయించుకోవాల్సి ఉందన్నారు. వీరంతా స్థానిక ఆర్‌బీకేలో చేయించుకోవాలని సూచించారు. ఎం.కృష్ణాపురంలో 20 మంది రైతులు జొన్న దిగుబడిని అమ్మేందుకు ఆసక్తి చూపుతున్నారన్నారు. దాదాపు 500 క్వింటాళ్ల వరకు రైతులు విక్రయిస్తున్నట్లు చెప్పారు. గోనెసంచులు కూడా రైతు భరోసా కేంద్రానికి మంజూరయ్యాయన్నారు. ఆర్‌బీకేల్లో జొన్నలు కొనుగోలు చేస్తారని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బంగారు నామాలు అందజేత



నామాలను అందచేస్తున్న భక్తుడు

శిరివెళ్ల: నల్లమల అటవీ ప్రాంతంలోని శ్రీ సర్వనరసింహస్వామి వారికి శనివారం బంగారు నామాలు కానుకగా అందాయి. బండిఆత్మకూరుకు చెందిన భక్తుడు దర్గా నరసింహుడు బంగారు నామాలను ఆలయ చైర్మన్ దేవనూరు రామాంజనేయరెడ్డి అందజేశారు. పూజారి పవన్‌కుమార్ శర్మ నామాలకు పూజలు చేసి స్వామి వారికి అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తమండలి సభ్యులు పాల్గొన్నారు.